ప్రజాశక్తి
శుక్రవారం 19 డిసెంబర్ 2025



డా॥రామసుబ్బయ్య కన్నుమూత


డా॥రామసుబ్బయ్య

'అనంత' వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ రామసుబ్బయ్య కన్నుమూశారు. వయోభారం అనారోగ్య సమస్యలతో గురువారం ఆయన అనంతపురం నగరం రామ్‌నగర్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. డాక్టర్ రామసుబ్బయ్యకు ఉమ్మడి అనంతపురం జిల్లా వైద్య రంగంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. సుదీర్ఘకాలంగా వైద్య రంగంలో సామాజిక దక్పథానికి నిలువుటద్దంగా నిలిచారు. వైద్య సేవలతో పాటు ప్రజ సేవలను ప్రత్యేకతను చాటుకున్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడంలో ఆయన ప్రముఖ భూమిక పోషించారు.

వార్త 8లో



ఎమ్మెల్యేల సామ్రాజ్యం.. ఎంపీలపై పెత్తనం..!



◆ ఎంపీలు ఎక్కడికెళ్లినా ఎమ్మెల్యేల నుంచి వ్యతిరేకత

◆ కేంద్ర పథకాల్లోనూ భాగస్వామ్యం లేదనే అసంతృప్తి

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

జిల్లాలో రాజకీయంగా చూసినప్పుడు అన్నింటిలోనూ ఎమ్మెల్యేలు కీలకంగా ఉంటున్నారు. వారి నియోజకవర్గాలను సామ్రాజ్యాలుగా భావిస్తున్నారన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది. వారితోపాటు ఎన్నికల్లో నిలబడి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు (ఎంపి)లు కూడా ఎమ్మెల్యేల ఎదుట దిగదుడుపుగానే మారుతోంది పరిస్థితి. తాజాగా గుంతకల్లులో చోటు చేసుకున్న పరిణామం ఈ అంశాన్ని మరోమారు చర్చకు దారితీసింది. అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎన్నికయ్యారు. ఆయన పరిధిలోని గుంతకల్లు ప్రాంతాల్లో పనులు చేస్తున్నారని తెలిసినప్పటికీ ఆ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు తమ వాటా తమకు డబ్బులివ్వాల్సిందేనని డిమాండ్ చేసినట్టు ఆరోపణలు గుప్పుమన్నాయి. తరువాత తనకేమీ సంబంధం లేదని ఎమ్మెల్యే చెప్పినప్పటికీ ఆయనపై ఆరోపణలు మాత్రం కొనసాగుతున్నాయి. ఈ విషయం పార్టీ అధిష్టానం వరకు వెళ్లినట్టు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని రైల్వే పైప్‌లైన్‌కు సంబంధించిన పనుల విషయంలో ఈ వివాదం బహిర్గతమైంది. ఇలా ఇతర ప్రాంతాల్లోనూ పార్లమెంట్ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యేల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న సందర్భాలూ అనేకమున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అనంతపురం జిల్లాలోనే ఒక మార్కెట్‌యార్డును ఎంపి అంబికా లక్ష్మినారాయణ సందర్శించారు. ఆ సమయంలోనూ స్థానిక ఎమ్మెల్యే నీవు ఏ రకంగా తన నియోజకవర్గం పరిధిలోని మార్కెట్‌యార్డును సందర్శిస్తావని గట్టిగా ప్రశ్నించినట్టు సమాచారం. ప్రజాప్రతినిధిగా అక్కడి పరిస్థితులను పరిశీలించేందుకు వెళ్లానని చెప్పినప్పటికీ ఇద్దరి మధ్య వివాదం మాత్రం చోటు చేసుకుంది. ఇంకొన్ని నియోజకవర్గాల్లోనూ ఎంపి పాల్గొనేందుకు వెళ్లిన సమయంలో స్థానిక నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండటం పార్టీ వర్గాల్లో చర్చనడుస్తోంది. ఎంపీ కూడా స్వయంగా ఒక దిశా సమావేశంలో అధికారుల తీరుపైనా అసంతృప్తిని బాహాటంగానే వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద నిధులు మంజూరై ప్రారంభిస్తున్న సమయంలో ప్రోటోకాల్ పాటించడం లేదని అధికారుల దృష్టికి దిశా సమావేశంలో తీసుకెళ్లారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపడుతున్న సమయంలో కనీస సమాచారం ఉండటం లేదని చెప్పారు. వీటిని తానే స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తూనే, ప్రోటోకాల్ విషయంలోనూ అశ్రద్ధ చేస్తే ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడం గమనార్హం. ఏడు నియోజకవర్గాల ప్రజల చేత ఎన్నుకోబడిన ఎంపిలకు అభివృద్ధి పనుల్లో తగిన భాగస్వామ్యం కల్పించడం లేదన్న అసంతృప్తి వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు మాత్రం అభివృద్ధి మొత్తాన్ని తమ ఖాతాల్లో వేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేపట్టే పనుల్లోనూ ఎంపిలకు తగిన ప్రాధాన్యత కల్పించడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. ఈ అంశాలు పలుమార్లు వివాదాలు చోటు చేసుకుని అధిష్టానం వరకు వెళ్లినా పెద్దగా సర్దుబాటు చర్యలేవి లేనట్టుగానే కనిపిస్తున్నాయి. తాజాగా గుంతకల్లు వ్యవహారంతో ఎంపి ప్రాధాన్యత అంశం మరోమారు తెరపైకి వచ్చినట్టయింది.

10 సూత్రాల లక్ష్యసాధనకు కార్యాచరణ

ముఖ్యమంత్రితో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా సమగ్రాభివృద్ధి సాధించేలా 2047 స్వర్ణాంధ్ర విజన్-10 సూత్రాల లక్ష్య సాధన ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయడానికి జిల్లా యంత్రాంగం సమిష్టిగా కషి చేస్తోందని కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరించారు. గురువారం నాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండవ రోజు రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన 5వ జిల్లా కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ శ్యాం ప్రసాద్ పాల్గొని జిల్లా ప్రగతిపై సమగ్ర నివేదిక సమర్పించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో అమలు చేస్తున్న కార్యాచరణ కార్యక్రమాలు, ప్రభుత్వం నిర్దేశించిన 10 సూత్రాల అమలు, వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల పురోగతి తదితర వాటి అమల్లో పురోగతి ఉందని తెలియజేశారు. నైపుణ్యాభివృద్ధి ఉపాధి కల్పన కార్యక్రమాల్లో భాగంగా జాబ్ మేళాల నిర్వహణ, స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, పరిశ్రమలతో అనుసంధానం ద్వారా ఉపాధి పెంపుపై జరుగుతున్న చర్యలను సమగ్రంగా వివరించారు. రెవెన్యూ, ఆదాయార్జన శాఖల కార్యాచరణ, భూసంబంధిత సేవల్లో పారదర్శకత, ప్రజలకు వేగవంతమైన సేవల అందింపు, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజాసానుకులా అవగాహన పెంపుపై కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలోనే జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలు గురించి ఎస్పీ సతీష్ కుమార్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి నిర్మూలన, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

నీళ్లు.. నిధులివ్వండి


ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్

ప్రజాశక్తి-బుక్కపట్నం

కరవు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాకు నిధులు, నీళ్లు ఇవ్వాలని ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ కోరారు. గురువారం నాడు విజయవాడ జల సౌద ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ అధ్యక్షతన మూడవ బోర్డు సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పత్తి చంద్రశేఖర్ ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించిన పలు విషయాలను సమావేశం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించమని కోరారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో ఎంతో సారవంతమైన నేల ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతాలకు సకాలంలో నీరు అందించగలిగితే రైతులు అత్యద్భుత దిగుబడి సాధిస్తారన్నారు. ఇరిగేషన్‌కు సంబంధించిన కార్యాలయాల్లో సిబ్బంది కొరతను కూడా భర్తీ చేయాల్సుందని ఆయన సమావేశం దృష్టికి తీసుకెళ్లారు.


సమావేశంలో పాల్గొన్న పత్తి చంద్రశేఖర్

నగదు స్వాహా చేసిన మాజీ యానిమేటర్


తేదీ మార్చిన తీర్మానం ప్రతి

ప్రజాశక్తి-పెనుకొండ

దొంగ సంతకాలతో మాజీ యానిమేటర్ నగదు స్వాహా చేసిన ఘటన మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శెట్టిపల్లికి చెందిన మారెమ్మ గ్రామైక్య సంఘం యానిమేటర్(విఒఎ)గా అశ్వర్థ నారాయణమ్మ ఏడాదిన్నర క్రితం పని చేసింది. ఆ తర్వాత కూటమి అధికారంలోకి రాగా ఆమె స్థానంలో జయలక్ష్మిని 2024 ఆగస్టులో యానిమేటర్‌గా నియమించారు. అయితే మాజీ యానిమేటర్ అశ్వర్థ నారాయణమ్మ 2025 ఆగస్టు నెల రూ. 16వేలు, సెప్టెంబర్ లో రూ. 16 వేలు బ్యాంకు నుంచి నగదు డ్రా చేసింది. గతంలో ఉన్న తీర్మానం కాపీలో తేదీలను మార్చి నగదు డ్రా చేసినట్లు ప్రస్తుతం పని చేస్తున్న యానిమేటర్ జయలక్ష్మి గుర్తించి వెలుగు అధికారులకు తెలుపగా వారు ఎపిఎం విజయరాజు పోలీసులను ఆశ్రయించారు. ఉన్నతాధికారుల నుంచి ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. యానిమేటర్ జయలక్ష్మి మాట్లాడుతూ యానిమేటర్‌గా విధుల్లో చేరిన తర్వాత 9 నెలల జీతం తీసుకున్నా అన్నారు. అనంతరం తీర్మానం కాపీలను సృష్టించి బ్యాంకు అధికారులను బురిడీ కొట్టించి మాజీ యానిమేటర్ నగదు డ్రా చేసిందని ఆరోపించారు.

అందరూ ఆమోదిస్తేనే పంచాయతీ విభజన



అమరాపురం : హేమామతిలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- అమరాపురం

ప్రజలందరూ ఆమోదిస్తేనే పంచాయతీ విభజన జరుగుతుందని ఎంపిడిఒ రామారావు స్పష్టం చేశా రు. మండలంలోని హేమావతి మేజర్ గ్రామ పంచాయతీలో గురువారం సర్పంచి తిప్పేస్వామి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ రామారావు, ఈవోఆర్‌డి లక్ష్మినర సింహప్రసాద్ హాజరై పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజల సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒ మాట్లాడుతూ అందరూ ఆమోదిస్తేనే పంచాయతీ విభజన జరుగుతుందన్నారు. కొందరి ప్రయోజనాల కోసం పంచాయతీని విభజించడం జరగదన్నారు. ఇదిలా ఉండగా హేమావతి మేజర్ పంచాయతీని 4 పంచాయతీలుగా విభజించాలని, లేనిచో ఉమ్మడి పంచాయతీగా ఉంచాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరారు. గ్రామసభలో ఎంపిపి ఈరన్న, ఎంపిటిసీ ఓంకారస్వామి, వీఆర్వో మహేంద్ర, పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు, నాయకులు మాలింగప్ప, నరసింహమూర్తి, నరసింహరాజు, తిప్పేస్వామి, రామిరెడ్డి, గురుమూర్తి, దయానంద, సుజాతమ్మ, రంగస్వామి, ప్రజలు పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని ముత్తుకూరు, మద్దనుకుంట, కెకె.పాళ్యం పంచాయతీలను విభజన చేయడానికి గురువారం సర్పంచి జగదాంబ, పంచాయతీ కార్యదర్శి అమరేష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించా రు. ఇందుకు పంచాయతీ పాలకవర్గం, ప్రజలు ఆమోదం తెలిపినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, నాయకులు షబ్బీర్, ప్రకాష్, కుమార్, శివన్న, దర్శన్, నిరంజన్, మూడ్ల గిరియప్ప, నారాయణప్ప, బసవరాజు, సిద్దేశప్ప, నరసింహ స్వామి, రాజప్ప, వేణుగోపాల్‌రెడ్డి, జయరామనాయక్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డువేశారు.. మట్టి వదిలేశారు..


సీసీ రోడ్డుపై తీయకుండా వదిలేసిన మట్టి

ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రమైన రొద్దం నుంచి చిన్నకోడిపల్లి వెళ్లే దారిలో పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి చిన్నకోడిపల్లి గ్రామం వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వం రూ. 1.05 కోట్ల వ్యయంతో చేపట్టింది. కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి క్యూరింగ్ చేయడంలో భాగంగా నీరు నిల్వ ఉండేలా రోడ్డుపై మట్టి వేసి పాయలు చేశారు. పది రోజులైనా రోడ్డుపై మట్టిని తొలగించకపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో రోజూ విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వెళ్లే వారు నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్లు రోడ్డుపై మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మడకశిర పౌర సరఫరాల గోదాములో నిల్వ చేసిన బియ్యం


పురుగురు పట్టిన బియ్యం

గోదాములో మగ్గుతున్న బియ్యం..!

ప్రజాశక్తి-మడకశిర టౌన్

ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు దారి మళ్లిస్తుండగా వివిధ శాఖల అధికారులు పట్టుకుని పట్టణంలోని పౌర సరఫరాల గోదాములో నిల్వ చేశారు. అయితే వాటిని గోదాములో నిల్వ ఉంచి చాలా రోజులు కావడంతో పురుగులు పట్టి ముగ్గిపోతున్నాయి. విజిలెన్స్, పోలీసు, రెవెన్యూ అధికారులు గత ఐదేళ్ల అక్రమంగా రవాణా అవుతున్న బియ్యాన్ని 220 టన్నుల వరకూ సీజ్ చేసి మడకశిర పౌర సరఫరాల గోదాములో నిల్వ చేశారు. అందులో ఇప్పటికే 300 బస్తాల బియ్యం పూర్తిగా పురుగు పట్టి పనికి రాకుండా పోయినట్లు తెలుస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి ఆ బియ్యం వృథా కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-మడకశిర రూరల్


విద్యార్థులు ప్రదర్శించిన నమూనా

స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్‌లో గురువారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. అందులో మండలంలోని వివిధ జడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు పాల్గొని వారు తయారు చేసిన వివిధ రకాల నమూనాలను ప్రదర్శించారు. వాటిని ఎంఇఒ భాస్కర్, హెచ్ఎం శకుంతల తిలకించారు. అలాగే వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు.

రొద్దం : స్థానిక జడ్పీ హస్కూల్‌లో హెచ్ఎం బి.లక్ష్మీ నారాయణమ్మ ఆధ్వర్యంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుచేశారు. అందులో మండలంలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల విద్యార్థులు నమూనాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా హాజరన ఎంఇఒలు అరవింద్, జయ భాస్కర్, నమూనాలను తిలకించారు. ఎంజెపి పాఠశాల ప్రథమస్థానం, దొడఘట్ట జడ్పీ హెచ్ఎస్ ద్వితీయ స్థాం, రొద్దం జడ్పీహెచ్ఎస్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో మండలంలో ఉన్న సైన్స్ ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

జిబి.హళ్లిని పంచాయతీ చేయాలని వినతి

ప్రజాశక్తి-రొళ్ల


తహశీల్దార్ షెక్షావలికి వినతి పత్రం ఇస్తున్న జిబి.హళ్లి ప్రజలు

మండలంలోని హులికుంట పంచాయతీని విభజించి జిబి.హళ్లి గ్రామం కేంద్రంగా నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం గ్రామస్తులు తహశీల్దార్ షెక్షావలికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ జిబి.హళ్లి, గొల్లహట్టి, కె.గొల్లహట్టి, దోమహట్టి, నసేపల్లి గ్రామాలు హులికుంట పంచాయతీకి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, ఆయా గ్రామాలను కలిపి జిబి.హళ్లి కేంద్రంగా నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహశీల్దార్ తెలిపారు.

బదిలీ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-గుడిబండ

ఉద్యోగోన్నతిపై మరో మండలా నికి బదిలీ అయిన ఇద్దరు అధికారులను గురు వారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో అధికా రులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానిం చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఏవో గంగా ధర్ ఉద్యోగోన్నతిపై అగళి ఎంపిడిఒగా, గుడిబండ పంచాయతీ కార్యదర్శి రెడ్డిప్రకాష్ ఉద్యోగోన్నతిపై అగళి డిప్యూటీ ఎంపిడిఒగా బదిలీ అయ్యారు. వారికి తహశీల్దార్ శ్రీధర్, ఎంపిపి రాధమ్మ, ఎంఇఒ రవిచంద్ర కుమార్, ఏవో అబ్దుల్ రహమాన్, న్యాయవాది శివకుమార్, ఉపాధి హామీ ఎపిఒ జగదీష్, ఈసీ జగదీష్, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దన కుంటప్ప, తాళికెర సర్పంచి రంగస్వామి పూలమా లలు, శాలువాలతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో షబ్బీర్, పంచాయతీల కార్యదర్శులు, ఎంపిడిఒ కార్యాలయం, సచివాలయాలు, ఉపాధి హామీ సిబ్బంది, పాల్గొన్నారు.

సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ హాలులో గురు వారం మండలంలోని అన్ని సచివాల యాల ఉద్యోగులకు కుటుం బాల సర్వేపై శిక్షణ ఇచ్చారు. కరికెర సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, ట్రైనర్ మంజునాథ్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి జనవరి 15వ తేదీ వరకూ అన్ని పంచాయతీల్లోనూ సచివాలయ సిబ్బంది క్లస్టర్ వారీగా ప్రతి ఇల్లు సర్వే చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సౌకర్యాలపై నివేదిక తయారు చేయాలన్నారు.

రేషన్ షాపుల స్కేల్స్‌కు సీల్

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని 35 రేషన్ షాపులకు సంబంధించిన స్కేళ్లను గురువారం తూనికలు కొలతల శాఖ అధికారులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేసి సీల్ వేశారు. అధికారులు మాట్లా డుతూ పేదలకు సరైన తూకాలతో నిత్యావసర సరుకులు అందించాలనే ఉద్దేశంతో స్కేళ్లను తనిఖీ చేసి ముద్ర వేశామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.ఉదయ్‌శంకర్‌రాజు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, సిఎస్‌డిటి సావిత్రి, సివిల్ సప్లై డేటా ఎంట్రీ ఆపరేటర్ బి.అశోక్‌రెడ్డి, లీగల్ మెట్రాలజీ సిబ్బంది, డీలర్స్ సంఘం అధ్యక్షులు సిద్దన్న, డీలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-గోరంట్ల

పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి పబ్లిక్‌పరీక్షల్లో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని మాజీ ఎంపీపీ విద్యాధరణి సూచించారు. మండలంలోని మందలపల్లి హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యాధరణి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఏమాత్రం సమయం వృథా చేయకుండా ఉపాధ్యాయుల సూచనలతో శ్రద్ధగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చింతా భాస్కర్‌రెడ్డి, వృషభసాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మాజీ ఎంపిపి విద్యాధరిణి

భూ సమస్యలపై గ్రామసభలు

ప్రజాశక్తి-అమరాపురం

రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు గురువారం రెవెన్యూ అధికారులు మండలంలోని తమ్మడేపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ లక్ష్మీనరసిం హం మాట్లాడుతూ చిన్న సన్న కారు రైతుల కోసం 2024 జూన్ 15వ తేదీ వరకు రిజిస్టర్ కానీ భూముల అగ్రిమెంట్ మీద గాని, సాదా బైనామా మీద కొనుగోలు చేసిన డాక్యు మెంట్లను క్రమబద్ధీకరణ చేసేందుకు ఈ గ్రామసభ నిర్వహించామన్నారు. గ్రామీణ ప్రాంతంలో పట్టా భూములు కలిగిన రైతులు మాత్రమే అర్హులన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములకు వర్తించదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ విన్సెంట్ పాల్, టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సర్పంచి సదానందగౌడ్, చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు మంజునాథ్, నాగరాజు, డీలర్ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

రొళ్ల : మండలంలోని రత్నగిరి పంచాయతీలో గురువారం తహశీల్దార్ షెక్షావలి, ఆర్ఐ గిరియప్ప ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి రైతులకు సదాబైనామా భూములపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు కొనుగోలు చేసిన భూములకు పాసుపుస్తకం పొందే అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అమరాపురం మండలం తమ్మడేపల్లిలో గ్రామసభ నిర్వహించిన అధికారులు



శ్రీరాములనాయుడిని సన్మానిస్తున్న నాయకులు

టిడిపి ఎన్పీకుంట మండల కన్వీనర్‌గా శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి- నంబులపూలకుంట

మండల పరిధిలోని పి. కొత్తపల్లి గ్రామపంచాయతీకి చెందిన మల్లెం శ్రీరాములు నాయుడు టిడిపి మండల కన్వీనర్‌గా ఎంపికయ్యాడు. పార్టీ విధేయుడిగా పేరు తెచ్చుకున్న శ్రీరాములనాయుడి సేవలను గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆయనను మండల కన్వీనర్‌గా ఎంపిక చేశారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తిని మండల కన్వీనర్‌గా ఎంపిక చేసినందుకు కొత్తపల్లి పంచాయతీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్వర్ రెడ్డి, వేమయ్య, వెంకటస్వామి రెడ్డి, మధుకర్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి చంద్ర, సుధాకర్ నాయుడు, వెంకటరమణారెడ్డి, శంకర్ రెడ్డి, చిన్నఅంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయ భవనం పరిశీలన

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మరో రెండు రోజుల్లో గ్రామ సచివాలయం – 2లోకి తహశీల్దార్ కార్యాలయాన్ని మార్చనున్న నేపథ్యంలో తహశీల్దార్ దేవేంద్రనాయక్ నూతన కార్యాలయ భవనాన్ని గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత తహశీల్దార్ కార్యాలయం పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాలతో కార్యాలయం భవనం మార్పు చేస్తున్నట్టు చెప్పారు.

నేడు మండల మీట్

ప్రజాశక్తి - కొత్తచెరువు

స్థానికఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నటరాజు తెలిపారు. ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టబోయే అభివృద్ధి గురించి అధికారులు వివరిస్తారన్నారు. అంతేకాకుండా సభ్యులు వారి గ్రామాల పరిధిలో ఉన్న సమస్యలను ఈ సమావేశం దృష్టికి తీసుకునిరావచ్చని చెప్పారు. సర్పంచులు ఎంపీటీసీలు మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు 'జీవనజ్యోతి' విద్యార్థిని

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని జీవన జ్యోతి పాఠశాలకి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైంది. నవంబర్ నెలలో తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 14 హాకీ పోటీల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎస్. విక్కి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో జరిగే హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సుజాత తెలిపారు. ఎంపికైన విద్యార్థి డిసెంబర్ 22 నుండి 27వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థిని హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బి.సూర్య ప్రకాష్ , పాఠశాల హెచ్ఎం సుజాత, కరెస్పాండెంట్ సిస్టర్ రిన్సీ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

నేటి నుంచి 'సఖి సురక్ష'

ప్రజాశక్తి హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా శుక్రవారం నుంచి సఖి సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. మహిళల ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, స్వయం సహాయక సంఘాల మహిళల శారీరక, మానసిక, పోషకాహార, ఆరోగ్యాన్ని కాపాడి వారి ఆర్థిక సురక్షిత సాధించడమే సఖి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమం రెండు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం మేడాపురం తెలుగు తల్లి సర్కిల్ మీసేవ సెంటర్ లో, శనివారం రహమత్పురం షాదీ మహల్ లో ఏర్పాటు చేశామన్నారు. 35 సంవత్సరాలు పైబడిన మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యుటిఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మధుసూదన్, రాజేష్

ప్రజాశక్తి - కదిరి టౌన్

యుటిఎఫ్ కదిరి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మధూసూదన్, రెడ్డి రాజేష్‌ను ఎన్నికున్నారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు అధ్యక్షతన ఎన్నికల అధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కదిరి పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి చెన్నూరు తాహేర్ వలి వ్యవహరించారు. కదిరి పట్టణ గౌరవ అధ్యక్షులుగా షమీమ్, అధ్యక్షులుగా మధుసూదన్, ఉపాధ్యక్షులుగా అనిత, వెంగమనాయుడు ప్రధాన కార్యదర్శిగా రాజేష్ బాబు, కోశాధికారిగా మానసను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కౌన్సిల్ సభ్యులుగా భార్గవ్, పవన్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సుధాకర్, కార్యదర్శులుగా జాబిఉల్లా, అనిల్ కుమార్, హరవింద్ కుమార్, మొహిద్దిన్ ,ఇర్ఫాన్ అలీ, వనజను ఎన్నుకున్నారు. నూతన కమిటీత సభ్యులకు జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున, సంతోష్ కుమార్, రవివర్ధన్ రెడ్డి, ఖాజా మోహియోద్దీన్, నాగేంద్ర , ఫయాజ్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పోరాట ఫలితమే మినీ సెంటర్ల ఉన్నతీకరణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

అంగన్వాడీలు గతంలో చేసిన పోరాటాల వలనే కూటమి ప్రభుత్వం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేసిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్. నరసింహులు పేర్కొన్నారు. కదిరి ప్రాజెక్ట్ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సమావేశం ఎన్‌జిఒ హోంలో ప్రమీల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జిఎల్. నరసింహులు మాట్లాడుతూ అంగన్వాడీలు చేసిన పోరాటాల ఫలితంగా కూటమి ప్రభుత్వం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిపోయిన 1801 మినీ సెంటర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా అంగన్వాడీలకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31వ తేది నుంచి జనవరి 4వ తేది వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రమీల, సుజాత సెక్టార్ నాయకురాళు వకులా, పద్మావతి, రాధ, రామలక్ష్మి, రజియా, లక్ష్మీదేవి, అరుణ, పద్మ, తేజ, పుష్ప, సువర్ణ, భారతి, హేమలత, ఈశ్వరమ్మ, మాతా, అమరావతి, కామాక్షి సిఐటియు నాయకులు బాబ్జాన్, రామ్మోహన్, జగన్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిఎల్. నరసింహులు

సమస్యలు పరిష్కరించాలి

ఆర్డీవోను కోరిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని సిపిఎం, సిఐటియు నాయకులు కోరారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిపిఎం, సిఐఐయు నాయకులు అధికారులను కలిసి సమస్యలను వివరించారు. మండలకేంద్రంలో శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే 896 .5 సర్వేనెంబర్‌లో ఇల్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చారని వాటిని నాయకులు ఇతరులకు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నిరుపేదలైన వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కస్తూరిబాయ్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రాళ్ల అనంతపురం క్రాస్‌లో జెకేపల్లి పొలంలో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులో ఏర్పాటు చేయమని అనేకసార్లు తహశీల్దార్‌కు వినతిపత్రాలు ఇచ్చినా వారు స్పందించలేదని చెప్పారు. ఈ విషయంపై ఆర్డీవో స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించాలని కోరారు. ముదిగుబ్బ మేజర్ పంచాయతీ చేస్తున్న పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు బాబ్జాన్, వెంకటేష్, పకీరప్ప, నౌషాద్ బాషా, రహీం, టైలర్ ముత్తు, రిక్షాముత్తు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



సమస్యలను విన్నవిస్తున్న నాయకులు

ఈ- ఫైలింగ్‌పై విద్యార్థులకు అవగాహన అవసరం



పోస్టర్లు ప్రదర్శిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - హిందూపురం

డిజిటల్ న్యాయపాలన వల్ల వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని అందువల్ల విద్యార్థులు డిజిటల్ పాలన, ఈ ఫైలింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం సాయంకాలం హిందూపురం మోడల్ స్కూల్‌లో ప్రధాన అధ్యాపకులు రమేష్ అధ్యక్షతన వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని 18 నుండి 24 వరకు నిర్వహిస్తున్నటువంటి వారోత్సవాలలో భాగంగా హిందూపురం మోడల్ హైస్కూల్ , కాలేజీ నందు విద్యార్థిని విద్యార్థులకు డిజిటల్ పాలన వ్యవస్థ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఈ సురేష్ కుమార్ జిల్లా ఉపాధ్యక్షులు అన్నదాత రామిరెడ్డి, సామాజిక సేవా కార్యకర్త శివ నాగజ్యోతి, హిందూపురం గోరింటాకు వినియోగదారుల సంఘం అధ్యక్షులు చలపతి హాజరయ్యారు ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ డిజిటల్ న్యాయం అంటే ఇ–కోర్టులు, వర్చువల్ విచారణలు, ఈ–ఫైలింగ్ వంటి సాంకేతికతల ద్వారా కేసులను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు.ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై, కన్స్యూమర్ అఫైర్స్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు అన్నదాత రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే నష్టపోయిన వాటికి సత్వర న్యాయం జరుగుతుందని చెప్పారు. సామాజిక సేవ కార్యకర్త శివ నాగజ్యోతి మాట్లాడుతూ కొనుగోలు చేసిన వస్తువులు నాణ్యతలో లోపం గాని, కొలతలలో వ్యత్యాసం గమనించినట్లయితే వెంటనే అధికారులను కలిసి ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చన్నారు. అలా పరిష్కారం కానీ ఫిర్యాదుల పైన వినియోగదారుడు జిల్లాస్థాయి కన్స్యూమర్ ప్రొటెక్షన్ కమిషన్లో ఫిర్యాదు చేసి న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి గాండ్లపెంట మండల కన్వీనర్‌గా వెంకట ప్రసాద్

ప్రజాశక్తి గాండ్లపెంట



వెంకటప్రసాద్

మండల పరిధిలోని గొడ్డు వెలగల పంచాయతీ చెందిన బి వెంకట ప్రసాద్ టిడిపి మండల కన్వీనర్ గా ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులు సిద్దారెడ్డి, కార్యదర్శిగా ఎస్ అసిఫ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బి వెంకట ప్రసాద్ మాట్లాడుతూ దాదాపు 25 సంవత్సరాల నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్నానన్నారు. తన సేవలను గుర్తించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తనకు ఈ బాధ్యతలు అప్పగించారన్నారు. గతంలో ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి కార్యకర్తగా సేవ చేస్తూ సర్పంచిగా ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవ చేశానని చెప్పారు. ప్రస్తుతం మండల కన్వీనర్‌గా పార్టీని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళతానని చెప్పారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ జి సోమశేఖర్ రెడ్డి, దాసి రెడ్డి కేశవరెడ్డి, ఎస్ అక్రం భాష, డి ఆనంద్ తదితరులు వెంకటప్రసాద్‌కు ఈసందర్భంగా అభినందనలు తెలిపారు.

పట్టు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పట్టు రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని పట్టు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, సోమకుమార్, నవీన్, సిద్దారెడ్డి తదితరులు మాట్లాడారు. పట్టు రైతులకు పెండింగ్లో ఉన్న ఇన్సెంటివ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే మల్బరీ షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇచ్చి పట్టు రైతులను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో పట్టు రైతులకు ఇచ్చే రాయితీలు ఇవ్వకపోవడంతో ఇక్కడ పండించిన పట్టును రైతులు కర్ణాటకకు తీసుకెళ్లి అమ్ముతున్నారని ఆవేదన చెందారు. దీంతో రైతులకు అధిక భారంతో పాటు పట్టు రీలర్లకు పూర్తి స్థాయిలో పట్టు గూళ్లు లభించక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాగే మార్కెట్‌లో ఆన్ లైన్ పేమెంట్ సిస్టమ్ ను త్వరితగతిన అమలు చేయాలని కోరారు. షెడ్లకు, మల్బరీ మొక్కలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14కోట్ల రాయితీను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు రామకృష్ణారెడ్డి, హనుమంతరాయప్ప, రాజేష్, శంకర తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం ఏర్పాటుకు కౌన్సిల్‌లో తీర్మానం చేయాలి

ప్రజాశక్తి హిందూపురం

హిందూపురం జిల్లా కేంద్రంగా ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయాలని జిల్లా సాధన కమిటీ నాయకులు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్‌ను కోరారు. గురువారం చైర్మన్ చాంబర్ లో జిల్లా సాధన కమిటీ అధ్యక్షులు ఇందాద్ నేతృత్వంలో ఛైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, హిందూపురం జిల్లా కేంద్రం కోసం అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి ఏకగ్రీవ తీర్మానం చేయాలని కోరారు. అలాగే శుక్రవారం హిందూపురంలో నిర్వహించే ర్యాలీ లో పాల్గొనాలని, అక్కడ జిల్లా కేంద్రం ఏర్పాటుకు మద్దతుగా మాట్లాడాలని కోరారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రం సాధన కోసం చేస్తున్న ప్రయత్నానికి అభినందనలు తెలిపారు. కౌన్సిల్ సమావేశం ఏర్పాటు విషయాన్ని ఎమ్మెల్యే తో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే కమిటీ సభ్యులు ఇచ్చిన సలహాలు, సూచనలు, అభ్యర్థనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి జిల్లా కేంద్రం సాధించే విషయంలో సంపూర్ణ మద్దతుఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి గౌరవ అధ్యక్షులు బాలాజీ మనోహర్, కార్యదర్శి నూర్ మహమ్మద్, గౌరవ సలహాదారులు ఉమర్ ఫరూక్, సోమశేఖర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి జమీల్, ఉపాధ్యక్షులు బాబావలి, అమానుల్లా కార్యదర్శులు కేవి.శంకరయ్య, విద్యార్థి నాయకులు కదరిష్, అతిక్, నరసింహమూర్తి, భారత్ చంద్ర, ఎంఐఎం ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



సచివాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

టేకులోడులో దాహం కేకలు

సచివాలయానికి తాళం వేసి నిరసన

ప్రజాశక్తి - చిలమత్తూరు


మండల పరిధిలోని టేకులోడు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. తమ కాలనీకి నీటి సరఫరా కావడం లేదని కాలనీవాసులు గురువారం గ్రామ సచివాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. సంవత్సరాలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.కొన్ని నెలలుగా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో గుక్కెడు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేదని మహిళలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గత్యంతరం లేక టేకులోడు గ్రామ సచివాలయానికి తాళం వేసి నిరసన చేపట్టామన్నారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

అంగన్వాడీ వ్యవస్థ బలోపేతమే 'కూటమి' లక్ష్యం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రభుత్వం అంగన్వాడీలకు మంజురు చేసిన 5జీ మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ధర్మవరం పట్టణం, ధర్మవరం రూరల్ మండలంలోని 230 మంది అంగన్వాడీ కార్యకర్తలు, 8మంది సూపర్వైజర్లకు సెల్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో అంగన్వాడీలకు ఈ సెల్ ఫోన్లు అందజేస్తున్నారన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలను అందించడం, పిల్లల పోషణ, బరువు, ఎత్తు కొలతలు వంటి వాటిని నమోదు చేయడానికి ఈ సెల్ ఫోన్లు ఉపయోగపడుతాయన్నారు. ప్రతి రోజూ బాల సంజీవని, పోషణ్ ట్రాకర్, మాతృవందన యోజన తదితర యాప్‌ల ఆధారంగా సౌకర్యవంతంగా విధులు నిర్వర్తించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ సెల్ ఫోన్లు అందజేస్తోందన్నారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపుతోందని పరిటాల శ్రీరామ్ అన్నారు.



సెల్‌ఫోన్ అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

నేరాలు ఘోరాలు

షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తినష్టం

ప్రజాశక్తి బత్తలపల్లి

వ్యవసాయ పొలం వద్ద గురువారం ఏర్పడిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత రైతు సింగారం నాగేష్ తెలిపారు. మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన నాగేష వేల్పుమడుగు రోడ్డుకు గల వ్యవసాయ పొలంలో నాలుగు ఎకరాల్లో చీనీచెట్లు సాగు చేశాడు. వాటి వయస్సు 6 సంవత్సరాలు. అదేవిధంగా మరో నాలుగు ఎకరాల్లో అరటి చెట్లు సాగు చేశారు. వీటికి డ్రిప్ పైపులు (డబుల్ ల్యాటర్) ద్వారా నీరు వదులుతున్నారు. ఈ క్రమంలో గురువారం పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న నాగేష్ ఉన్నఫలంగా విద్యుత్ మెయిన్ లైన్ నుంచి వచ్చిన వైర్లు మిల్ట్ అయి నిప్పులు చెలరేగాయి. దీంతో గడ్డిని నిప్పు అంటుకుని వెంటనే పొలంలో మంటలు వ్యాపించాయి. దీంతో గ్రామంలోకి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే 20 కట్టల డ్రిప్ పైపులు, 90 చీనీచెట్లు, 40 అరటి చెట్లు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. దీంతో తనకు రూ.1లక్ష ఆస్తినష్టం సంభవించినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

నిందితుడిపై పీడీ యాక్ట్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర నేరాలకు పాల్పడిన కౌలేపల్లి అమ్జాద్ ఖాన్ ఆలియాస్ మెగా అమ్జాద్ అనే వ్యక్తిపై పిడి యాక్ట్ కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. కదిరి టౌన్‌లోని జేకుపాళ్యం వీధిలో నివాసముంటూ, స్థానిక రాయలసీమ సర్కిల్‌లో బట్టల వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్న కౌలేపల్లి అమ్జాద్ ఖాన్ ఆలియాస్ మెగా అమ్జాద్ నకిలీ పత్రాల సాయంతో ఇతరుల భూములను కబ్జా చేయడం, గొడవలు, ఇతర కేసులలో పాల్గొనడం, ఇటీవల ప్రముఖ వ్యక్తులపై ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో కించపరిచే విధంగా పోస్టులు, కామెంట్లు పెట్టి, వాటిని వైరల్ చేసి ప్రజా శాంతికి భంగం కలిగించడం వంటివి పాల్పడినట్టు గుర్తించామన్నారు. ఈ వ్యక్తిపై కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సుమారు 15 కేసులు నమోదు అయ్యాయని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌలేపల్లి అమ్జాద్ ఖాన్ ఆలియాస్ మెగా అమ్జాద్‌ను కడప సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు. అంతేకాకుండా కదిరి నియోజకవర్గ పరిధిలో అనవసరంగా రాజకీయ వర్గాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు, కామెంట్లు పెట్టి ప్రజా శాంతికి భంగం కలిగించే వారిని, భూ కబ్జాలు, గంజాయి స్మగ్లింగ్, హత్యాయత్నం ఇతర తీవ్ర నేరాలకు పాల్పడిన మరికొందరిని గుర్తించడం జరిగింది. వారిపై కూడా పీడీ యాక్ట్ అమలు చేసేందుకు జిల్లా ఎస్పీ ద్వారా కలెక్టర్‌కి నివేదిక పంపామన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-అగళి

మండలంలోని ముక్కడంపల్లి గ్రామ సమీపంలోని ఓ బావిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. వివరాలు.. కోడిపల్లిచెరువు కింద ముక్కడంపల్లి గ్రామానికి చెందిన రైతు కృష్ణప్ప పొలంలో ఒక పాత బావి ఉంది. బుధవారం పశువులకాపరి అటుగా వెళ్లగా దుర్వాసన రావడంతో బావిలోకి తొంగి చూడగా మృతదేహం కనిపించింది. అతని ద్వారా విషయం తెలిసిన వెంటనే రైతు కృష్ణప్ప పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే చీకటి పడడంతో గురువారం పోలీసులు, క్రైమ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మడకశిర ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వైద్యులను పిలిపించి అక్కడే పోస్టుమార్టం చేయించి పూడ్చి పెట్టారు. అతడు మృతిచెంది మూడు నాలుగు రోజులు అయి ఉంటుం దని, ముఖం గుర్తుపట్టలేని విధంగా మారిపోయిందని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ శ్రీరాములు తెలిపారు.

అనుమతి లేని లేఅవుట్లపై ఫిర్యాదు

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వేసిన అనుమతి లేని లేఅవుట్లపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపిడిఒ పార్థసారథి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం మాట్లాడతూ మండలకేంద్రంలోని అనధికార లేఅవుట్లు, భవనాలను పలుమార్లు ఈవోఆర్డీ మాధవరెడ్డితో కలసి పరిశీలించామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అహుడా అనుమతి పొందిన తరువాతనే కట్టడాలు ప్రారంభించాలని తెలిపారు. ఇదివరకు అక్రమ కట్టడాలు కట్టిన వారి పైన చర్యలు ఉంటాయని ఈ విషయాన్నికలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి నల్లమాడ

మండల కేంద్రంలో నాగలకట్ట వీధిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒకు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధిలో విద్యుత్‌స్తంభాలు లేవన్నారు. సిసి రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గోవిందు, మల్లిఖార్జున, రామయ, రాజు, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి హిందూపురం

అవార్డు గ్రహీత మండల విద్యాశాఖాధికారి గంగప్పను గురువారం సన్మానించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సీఆర్ఎంటీలు, పీటీఐలు, ఎంఐఎస్ కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, మధ్యాహ్నం ఏజెన్సీలు ఎంఇఒను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. అలాగే ఎంజీఎం పాఠశాలలో హెచ్ఎంల సమావేశంలో హెచ్ఎంలు ఎంఈఓను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ - 2 ప్రసన్నలక్ష్మీ, హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

మున్సిపల్ ఛైర్మన్ డిఇ.రమేష్

ప్రజాశక్తి హిందూపురం

వార్డుల్లో ప్రజలందరికీ మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకెళుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, వీధి దీపాలు వెలగడం లేదని ఇలా అనేక సమస్యలను స్థానికులు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఇటీవల విడుదలైన రూ.92 కోట్లతో వార్డుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏసీ. నాగరాజు, మంచాల మారుతి, డి.హరీష్ కుమార్, అమర్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసుల సమస్యలను తెలుసుకుంటున్న ఛైర్మన్ రమేష్

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



తాము రూపొందించిన నమూనాల గురించి వివరిస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

బాల్యం నుంచి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఎంఇఒ సురేష్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను గురువారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఇఒ మాట్లాడుతూ పిల్లల్లో బాల్యదశ నుంచే సైన్స్ పట్ల విజ్ఞానాన్ని పెంపొందించాలన్నారు. బాల్యం నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చడానికి, శాస్త్రీయ ఆవిష్కరణల వైపు దృష్టి మరలడానికి ఈ సైన్స్ ఫేయిర్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల నుంచి దాదాపుగా 35 మంది విద్యార్థులు తమ ప్రదర్శనలతో హాజరయ్యారు. వాటిలో నుంచి ఉత్తమమైన ఏడు ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈనెల 20వ తేదీ బుక్కపట్నం డైట్ కళాశాలలో జరిగేటువంటి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఈ ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, పవన్ కుమార్, గౌరీ శంకర్ రెడ్డి, చంద్రమోహన్, మనోహర్ నాయక్, హరినాథ్ రెడ్డి, బాబావలి, చంద్రకళ, మధుబాబు, శివయ్య, వెంకటేష్, రజనీకాంత్, గంగ రత్నమ్మ, సువర్చల , పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి :మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. దాడి తోట, కునుకుంట్ల, పిన్నదరి, ఆత్మకూరు, కేజీబీవీ తాడిమర్రి పాఠశాలల విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారని హెచ్ఎం వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఇందులో ఆరుగురు విద్యార్థులను జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ ప్రదర్శనకు ఎంఇఒ కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, కాలేజీ లెక్చరర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.



పార్టీ అధ్యక్షుడితో నియోజకవర్గ ఇన్‌ఛార్జి

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి హిందూపురం

హిందూపురం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపకకు సూచించారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త దీపిక, వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం తో పాటు పార్టీ బలోపేతం కోసం కష్టపడి పని చేయాలని జగన్ సూచించినట్లు దీపిక వివరించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం పై జరిగిన దాడి గురించి జగన్ కు వివరించినట్లు ఆమె తెలిపారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం



అవగాహన కల్పిస్తున్న అధికారిణి

ప్రజాశక్తి - బత్తలపల్లి

బాల్యవివాహాలను నిర్మూలిద్దామని ఎజిసిడిపిఒ అనిత అన్నారు. గురువారం మండలంలోని సంజీవపురం వద్ద గల కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో ప్రిన్సిపల్ గుల్జార్ బేగం అధ్యక్షతన బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎజిడిఇఒ అనిత మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని వయసు నిండకముందే పిల్లలకు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేయాలన్నారు. పేదరికం వల్ల తల్లిదండ్రులు ఆడపిల్లను భారంగా భావించడం, చదువు లేకపోవడం, అవగాహన లోపం వల్ల చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తున్నారన్నారు. బాల్య వివాహాల వల్ల పిల్లల జీవితం దెబ్బతింటుందని చెప్పారు బాల్య వివాహం చేయడం, చేయించడం నేరమేన్నారు. ప్రిన్సిపల్ గుల్జార్ బేగం మాట్లాడుతూ తోటి విద్యార్థినులకు పెళ్లిళ్లు చేస్తుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుతో ఉపాధ్యాయులు, అధికారులు

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి - పరిగి

క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందనిడివైఇఒ జాన్‌రెడ్డప్ప పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు విద్య బోధనతో పాటు క్రీడలు కూడా అవసరమని భావించి ఇటీవలే మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజయం సాధించిన క్రీడా జట్లకు డివిజన్ స్థాయి పోటీలను పెనుకొండ కేంద్రంలో ఇటీవలే నిర్వహించారు.ఈ క్రీడా పోటీలో భాగంగా ఫైనల్‌లో పరిగి స్ట్రైకర్స్ త్రో బాల్ జట్టు హిందూపురం మహిళ ఉపాధ్యాయురాల త్రోబాల్ జట్టుపై విజయం సాధించింది. ఈ సందర్భంగా డివిజన్ స్థాయిలో విజేతగా నిలిచిన జట్టుకు డివైఈవో జాన్ రెడ్డప్ప అభినందనలు తెలియజేస్తూ షీల్డ్‌ను బహూకరించారు. డివిజన్ స్థాయిలో గెలిచిన జట్టు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు జట్టు కెప్టెన్ పరిగి ఎంఇఒ లక్ష్మీదేవి తెలిపారు.

పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు

ప్రజా శక్తి పుట్టపర్తి రూరల్

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలని జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి హరికృష్ణ తదితరులు రేమండ్స్‌గ్రూపు ప్రతినిధులను కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ కార్యాలయంలో రేమండ్స్ గ్రూప్‌కు చెందిన జె.కె. మైని కంపెనీ ప్రతినిధులతో అధికారులు సమావేశమయ్యారు. గుడిపల్లి పారిశ్రామిక వాడ, టేకులోడు పారిశ్రామిక వాడలలో ప్రెసిషన్ ఇంజనీరింగ్ , గ్లోబల్ ఏరోస్పేస్ రంగాలలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, అలాగే నైపుణ్యం కలిగిన యువతకు కల్పించబోయే ఉద్యోగ అవకాశాలపై కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన వివిధ రకాల అనుమతులు (అప్రూవల్స్), ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు (ఇన్సెంటివ్స్), అలాగే జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుకున్న యువతకు కల్పించబోయే ఉపాధి అవకాశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. జె.కె. మైని కంపెనీ ప్రతినిధులు 2027 జనవరి నాటికి తొలి దశలో ఉత్పత్తి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా జిల్లాలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ ప్రియా మనోజ్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ రాఘవేంద్ర, స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తేజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిపిపి విధానం రద్దు చేయాలి

ప్రజాశక్తి హిందూపురం

కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో నిర్వహించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వెంటనే సంబంధిత విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ గురువారం రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్ కుమార్, నరసింహమూర్తి, మారుతి రెడ్డి, బాబు, శ్రీనివాసులు, సురేష్, బద్రి, గిరీష్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి బత్తలపల్లి

ప్రభుత్వ సేవలను సాంకేతికంగా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు, సిడిపిఒ సరస్వతి పేర్కొన్నారు. గురువారం ధర్మవరం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో బత్తలపల్లి 'ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 234 అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన 5జీ మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆన్లైన్ సేవలను కొనసాగించేందుకు ఫోన్లు ఉపయోగపడతాయన్నారు. ఆదేవిధంగా ప్రాజెక్ట్ పరిధిలోని 35 మంది మినీ అంగన్వాడీ వర్కర్లను ఆప్‌డేడ్ పద్ధతిలో మెయిన్ టీచర్లుగా ఉద్యోగోన్నతి కల్పించిన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు చంద్రమ్మ, ఎర్రమ్మ, దేవమణి. కోఆర్డినేటర్ ఓబులమ్మ. అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి మొండి బకాయిల వసూలుకు చర్యలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి ఏరియాకు సంబందించి స్త్రీనిధి ఋణాలు మొండి బకాయిల రికవరీకి చర్యలు తీసుకోవటానికి స్త్రీనిధి జిఎం సిద్ది శ్రీనివాస్ విజయవాడ నుండి వచ్చినట్లు స్థానిక అధికారులు తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో రుణాల మంజూరు, సంఘం సభ్యులకు స్త్రీ నిధి నుండి రుణాలు మంజూరు చేసిన తర్వాత సభ్యులు తిరిగి రికవరీ చెల్లిస్తున్న విషయాలపై గ్రామాలను సందర్శించారన్నారు. ఈ మేరకు కదిరి మండలం కుమ్మర వాండ్లపల్లి శ్రీ లక్ష్మీ ప్రసన్న గ్రామ సంఘంలో ఎన్‌పిఎ రికవరీపై చర్చించామన్నారు శ్రీనివాస మహిళా సంఘం సభ్యురాలు 292 రోజుల బకాయి పడిన మొత్తం రూ. 34000లను ఈసందర్భంగా రికవరీ యాప్ లో కట్టించినట్లు అధికారులు చెప్పారు . ఈ కార్యక్రమంలో జెడ్‌డిజిఎం వెంకట ప్రకాష్, ఎజిఎం హన్ మెష్ బాబు , స్త్రీనిధి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువుకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు ఎన్ విజయభాస్కర్ చౌదరి(70) మృతిచెందాడు. గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో వైద్య చికిత్సలు పొందుతున్న ఆయన గురువారం మృతి చెందాడు. ఈసందర్భంగా పలువురు టిడిపి నాయకులు విజయభాస్కర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, హిటాచీ సీజ్

ప్రజాశక్తి-యల్లనూరు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌తోపాటు ఇటాచీ వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రం సమీపంలోని ప్రయివేటు ఇసుక రీచ్‌లో కాకుండా వేరే ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో సమాచారం తెలుసుకున్న మైనింగ్ జియాలజిస్టు కె.వరప్రసాద్‌రెడ్డి, ఆర్‌డిఒ కేశవనాయుడు, తహశీల్దార్ రాము ఆదేశాలతో లోడు చేస్తున్న ఇటాచీ, టిప్పర్ వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.